# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర



*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్ధికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కధా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# ప్రార్థించే చేతులు

'మంచితనం ఏ ఒక్కరి స్వంతం కాదు వారసత్వంగా రావాలనీ లేదు '.. పొద్దున్నించీ పదోసారి అనుకుని ఉంటుంది నీత.. ఆ మాట

"ఈ రోజు మనకి డిన్నర్ చేసేది, లేదా? త్వరగా రా " నవ్వుతూ అంటున్న భర్త మాటలకి నవ్వుతూ " ఓ డిన్నర్ రెడీనా? థాంక్ యూ" అంటూ టేబిల్ దగ్గరకి నడిచింది ప్రముఖ కౌన్సిలర్ నీత.

గార్లిక్ నూడుల్స్ ఇద్దరికీ రెండు బౌల్స్ లో వేసి ఉంచాడు రిషి అప్పటికే.

" ఏదో చదువుకుంటున్నావు కదా! అందుకే నిన్ను కదిలించదల్చుకోలేదు" అన్నాడు రిషి నవ్వుతూ...

" లవ్ యూ రిషి" అంది నీత నెమ్మదిగా.

" ఏది? నూడుల్స్ కేనా?" అన్నాడు రిషి మరింత పెద్దగా నవ్వుతూ.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేశారు.

ఒక కౌన్సిలర్ గా ఎంత తటస్థంగా ఉందామని ప్రయత్నించినా కొన్ని కేసులు అప్పుడప్పుడు ఆమెని కలత పెడుతూనే ఉంటాయి.. ఆ ప్రభావం నుంచి బయటపడడానికి కొన్ని సార్లు ఒకటి రెండు రోజులు పడుతుంది. అలాంటిది ఈ రోజు ఆమె ఎక్కువ సంతోషంగా కనిపించడం చూసి రిషికి చాలా హాయిగా ఉంది.

" ప్రతీ సారీ లా కాకుండా ఈ రోజు నువ్వు ఇలా ఉండడం బావుంది" అన్నాడు భార్య చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

" నిజం రిషీ, నాకూ అంతే.. మన చుట్టూ కనిపించే ప్రపంచంలో ఇంత దుర్మార్గం ఉందా? అనిపించి బాధపడతాను కదా! అప్పుడప్పుడు. అలాంటిది ఈ రోజు ఇంత మంచితనం ఉందా? అనిపించింది" అంది చిరునవ్వుతో.

" అయితే వినవలసిందే! కౌన్సిలర్ గారికభ్యంతరం లేకపోతే" అన్నాడు.

తనదగ్గరకొచ్చే వాళ్ళ పేర్లు, ఇతరవివరాలనెప్పుడూ రిషి కి కూడా చెప్పదు. ఎప్పుడైనా కేసు మరీ కదిలిస్తే పేర్ల లాంటివి కాకుండా వివరాలు క్లుప్తంగా చెప్తుంది.

మాట్లాడలేదు నీత.. మౌనంగా తింటూ ఆలోచిస్తోంది.

చెవిలో మళ్ళీ మళ్ళీ వినబడుతున్న కెవిన్ మాటలు.

" నిజానికి మీరిలా ప్రతీ శనివారం ఈ ఎన్.జీ.వో లో నామినల్ ఫీజ్ కి కౌన్సిలింగ్ చేస్తారని తెలిసింది కనక రాగలిగాను, లేదంటే కౌన్సిలర్ దగ్గర సలహా తీసుకునేంత ఆర్థిక స్తోమత నాకుందని నేననుకోను. యూ ఆర్ వెరీ నైస్" యాభై దాటిన అతను హుందాగా ఉన్నాడు,హుందాతనానికి తగ్గ పరిణతి.

“చిన్నప్పటి నించీ ఒక కథ విని పెరిగాను.

సోదరుడి చిత్రలేఖనం చదువు కోసం త్యాగం చేసిన అన్న చేతిలో రూపు దిద్దుకున్న అద్భుత చిత్రం ' ప్రేయింగ్ హాండ్స్ '. అదే ప్రార్థించే చేతులు.

నిస్సంశయంగా అది గొప్ప కథేకానీ అది నా ఇంట్లో పునరావృతం కావడం, ముఖ్యంగా నా పెద్ద కొడుకుకి అలాంటి అనుభవం ఎదురవడం నేను సుతరామూ అంగీకరించలేని విషయం..”

గద్గదంగా వినబడిన కెవిన్ మాటలు, కళ్ళల్లో తడి...

దాదాపు అదే మాటలు హేరీ అన్నాడు. తెల్లగా పొడుగ్గా, నూనుగు మీసాల నున్నటి కుర్రాడు.. నెమ్మదిని అనువెరిగి ముత్యాలు దొర్లినట్టు మాట్లాడే తత్వమున్నపదహారేళ్ళ చిన్నవాడు.

" మేమ్, ఈ ప్రపంచంలో ఒక కథ ఎవరినైనా విపరీతంగా ప్రభావితం చెయ్యగలదా? అన్న ప్రశ్న వస్తే నావరకూ అది ' ప్రేయింగ్ హేండ్స్ '. ఒక పెద్ద అన్న ఎలా ఉండాలో దిశానిర్దేశం చేసే కథ అని నా అభిప్రాయం.. నా తమ్ముడికి తప్పక న్యాయం జరగాలి అని నా నిశ్చితాభిప్రాయం"

తలవంచుకుని చెప్పినా తడి లేని కళ్ళు, నిర్మ లమైన మాట. ఆ ఇద్దరూ ఒక ఇంటివారని. చెప్తున్నది ఒకే విషయమని నీత కు అర్థం అవడానికి కాస్త సమయం పట్టింది. ఇద్దరిదీ ఒకే కుటుంబమవ్వడం కాదు సమస్య.. ఇద్దరి సమస్యా ఒకటి.

అసలు అనుకుంటే.. అది సమస్య అనుకుంటే..

కెవిన్:

“నా పేరు కెవిన్.. నా భార్య లిజా.. ఎలిజబెత్..

లిజాకి నాకు వివాహమయ్యి ఆరేళ్ళు కావస్తోంది.. మా ఇద్దరికీ ఇది రెండవ పెళ్ళి.. లిజా భర్త శామ్ చనిపోయారు.. నా మొదటి భార్య జూలీ నేనూ విడిపోయాము.

లీజా, నేనూ మా ఇద్దరికీ కావలసిన వారి పార్టీలో కలిశాము ఏడుసంవత్సరాలాక్రితం తొలిసారి కలిశాము. దాదాపు సంవత్సరం గడిచేముందు పెళ్ళి చేసుకున్నాం. “

" నైస్.. అయితే ప్రోబ్లెం ఏమిటి?" అడిగింది నీత.

క్షణం సేపు మౌనం..

" పరవాలేదు చెప్పండి.. విషయం ఏమిటి?" అడిగింది నీత..

“ప్రాబ్లెం అని కాదు మేమ్.. ఇద్దరు పిల్లల మధ్య..” ఆగాడు అతను

“మీకిద్దరు పిల్లలా? వాళ్ళతో ఏమైనా సమస్యా?" అడిగింది నీత.

“యా.. హేరీ లిజా కొడుకు.. జాక్ నా కొడుకు.. “అన్నాడు నెమ్మదిగా..

“ఓ.. అర్ధమయింది.. ఇద్దరికీ పడదా? ఆరేళ్ళయిందన్నారే మీ పెళ్ళి జరిగి.. ఇంకా పిల్లలు సర్దుకోలేదా?” పిల్లలెకెన్నేళ్ళు ?అంది ఆమె...

" అలాంటి సమస్యే లేదు.. ఇద్దరూ చాలా ప్రేమగా, స్వంత అన్నదమ్ముల్లా ఉంటారు. ముఖ్యంగా హేరీ! జాక్ ని ఎంత ప్రేమగా చూసుకుంటాడో! నేను చెప్పలేను కూడా. హేరీకి పదిహేడు, జాక్ కి పదహారు...” అన్నాడు

"మరి అంతా బానే ఉంది కదా, సమస్య ఏముంది? అంది నీత అర్ధం కానట్టు...

“చెప్తాను.. హేరీని నేను చూసుకోవలసినంత బాగా చూసుకోవటం లేదని నా కెప్పుడూ అనిపించేది, అనిపిస్తూనే ఉంది.. అనిపించడం కాదు అదెందుకో నా మనసునెప్పుడూ కలవరపెడుతుంది కూడా.. “ అన్నాడు తప్పు చేసిన భావన గొంతులో ధ్వనిస్తుండగా..

“ఎందుకలా అనుకుంటున్నారు? హేరీ ఎప్పుడైనా అలాచెప్పాడా? మీకు కాకపోయినా వాళ్ళ అమ్మకి? జాక్ తో బాగా ఉంటాడని చెప్పారు కదా! మరింకేమిటి?”

“ఈ ప్రశ్నకి నా దగ్గర సమాధానం లేదు.. హేరీ కానీ, లీజా కానీ ఎప్పుడూ నాతో ఏమీ చెప్పలేదు.. కానీ వాడు నామీద, జాక్ మీదా చూపించే ప్రేమలో నేను పదో వంతు కూడా వాడికివ్వలేకపోతున్నాను అన్నది మాత్రం నిజమని నా మనసెందుకో బలంగా నమ్ముతోంది..ఎంత ప్రయత్నించినా నేనిందులోంచి బయటకు రాలేకపోతున్నాను.. “ అన్నాడు..

“హేరీ పసివాడు కాదు,.. తనకి కావలసిందేమిటో చెప్పగలవాడు.. అలాగని పెద్దవాడు కాదు నేను ఒప్పుకుంటాను.. మీరు మరీ సున్నితంగా ఆలోచిస్తున్నారేమో? అసలు లేని సమస్యని మీరు ఉందని ఎందుకనుకోవడం? “

“మొదటిసారి తప్పినా, రెండో సారి మీకు మంచి జీవిత భాగస్వామి దొరికింది, పిల్లలు బావున్నారు.. ఇంకెందుకు బాధ పడడం?” అంది నీత..

కెవిన్ మాట్లాడలేదు..

“ఏదైనా ప్రత్యేకమైన సమస్య ఉంటే చెప్పండి.. కనీసం ఆ దిశలో పరిష్కరించడానికి ప్రయత్నం చేద్దాం!” అంది నీత..

“ మాది మామూలు మధ్యతరగతి సంసారం. నేను లాండ్ స్కేపింగ్ కాంట్రాక్టులు చేస్తాను.. లిజా నర్స్.. మా ఇద్దరి సంపాదనా మా ఇద్దరు పిల్లలని సరిగ్గా చూసుకోగలిగితే చాలనుకున్నాం.. అందుకే ఇంక మళ్ళీ పిల్లల మాట తలపెట్టలేదు.. లిజా లాంటి ఒక కూతురుంటే బావుండునని నాకెన్ని సార్లు అనిపించినా సరే.! మా పిల్లలిద్దరూ కూడా అరమరికలు లేకుండా కలిసిపోవడం కూడా మాకు ఎంతో బలాన్నిచ్చింది”. అన్నాడు..

“నేను హైస్కూల్ డ్రాప్ అవుట్ ని.. చిన్నప్పటినించి మొక్కలు ఆకర్షించినట్టుగా నన్నింకేమీ ఆకర్షించలేదు.. అలాగని పెద్ద నేర్పరిని కాదు..

ఆకుపచ్చని ఆకులూ, రంగు రంగుల పువ్వులూ ఇవన్నీ లేకపోతే ప్రపంచం ఎంత బోసిగా ఉంటుందో? నా ఊహకి కూడా అందదు..

చదువబ్బక తిరుగుతున్న నాకు ఓ స్నేహితుడి తండ్రి చూపించారు గార్డెనింగ్, లాండ్ స్కేపింగ్.. ఒకసారి మనకనువైన వేళల్లో పని చెయ్యడానికలవాటు పడితే ఒకరి కింద ఉద్యోగం చెయ్యడం కష్టం.. జీవితం పట్ల నాకెంతో ఆరాధన, గౌరవం.. సంతృప్తి అన్నింటికన్నా ముఖ్యం..

పని ఉన్నప్పుడు పని, లేనప్పుడు వంట, గిటార్.. ఇదే నా ప్రపంచం..

ఆ ప్రపంచం లోకి మొదట్లో ఇష్టంగా వచ్చిన జూలియా నా 'గొర్రె తోక బెత్తెడు' జీవితాన్ని నన్ను ప్రేమించినంతగా ప్రేమించలేకపోయింది..

'జాక్ కైనా మంచి భవిష్యత్తు ఇవ్వాలి కదా!' అని తరచుగా నాతో గొడవపడేది..

అందుకే తన దారి తాను చూసుకుంది..

కారణాలేవైనా జాక్ నాదగ్గరే ఉండిపోయాడు. ఆవిడ ఉద్యోగం లో వెసులు బాటు వచ్చి ఇటు వచ్చినప్పుడు జాక్ తో 'ఓ డిన్నరో, ఒక లంచో!' ఇలా కాస్త సమయం గడుపుతుంది..

చిన్నప్పుడు వేసవి శలవలుకో, క్రిస్మస్ సెలవులకో దగ్గరకు రమ్మని పిలిచి తీసుకువెళ్ళేది..ఈ మధ్య అది కూడా లేదు..

దానిపట్ల మాకేమీ ఫిర్యాదులు లేవు..

నేనూ, జాక్.. 'ఒకరికి ఒకరం!' అన్నట్టుగా హాయిగా ఉన్నాము లిజా, హేరీ మా జీవితాల్లోకి వచ్చేవరకూ.. వాళ్ళొచ్చాకా హాయి ఇనుమడించింది తప్ప ఇబ్బంది అవలేదు..

కొద్దిపాటిదే అదనపు సంపాదన. కానీ ఎనలేని తృప్తి.. అన్నదమ్ముల్లా కలిసిపోయిన ఇద్దరి పిల్లలూ.. నాకు ప్రాణంగా మెలిగే భాగస్వామి.. జీవితమంతా ఇలా గడిచిపోతే చాలనుకున్నాను..

అంతలో ఎప్పుడో మొదలయింది నాలో ఈ మధన..

వాడి అసలు నాన్న బ్రతికి ఉండి ఉంటే వాడికి ఇంకా ఎంతో మంచి జీవితం ఇచ్చి ఉండేవారన్న భావన నాలో ఎప్పుడూ ఉండేది..

హేరీ చాలా మంచి కుర్రాడు, తెలివైనవాడు.. బాగా చదువుకుంటాడు. జాక్ కూడా పరవాలేదు.. మరీ హేరీ అంత కాకపోయినా..

ఒకటే కేక్ ఉంటే హేరీ జాక్ కోసం ఉంచేవాడు..

క్రిస్మస్ కి వచ్చిన అతి ఖరీదైన, మంచి గిఫ్ట్ తమ్ముడికే ఇచ్చేవాడు..

వాడికిష్టమని వారానికొకసారి సూప్, బర్గర్లు చేస్తాడు.. ఇలా అన్ని విషయాల్లోనూ అంతే...

వాడిని చూసినవారెవ్వరూ వాడిని ప్రేమించకుండా ఉండలేరు.. అచ్చు వాళ్ళ అమ్మ పోలికే..

ఎదుగుతున్న పిల్లలని స్నేహితుల్లా చూసుకోవాలి అని నమ్ముతాను నేను.. అలాగే ఉంటాను.. అందుకని ఇద్దరికీ నా దగ్గర బాగా చేరిక.

పిల్లలు చిన్నప్పటినించీ తరచుగా డాక్టర్ ఆట ఆడేవారు.. అప్పుడప్పుడు డెక్ మీద, తరచుగా ఇంట్లోనూ..

అన్ని విషయాల్లోనూ తమ్ముడికి మొదట అవకాశాన్నిచ్చేసే హేరీ ఇక్కడ మాత్రం ఎప్పుడూ తానే డాక్టర్ గా ఉంటానని అనేవాడు, జాక్ ని పేషెంట్ గా ఉండమనేవాడు.. జాక్ అప్పుడప్పుడు ఒప్పుకున్నా, చాలా సార్లు గొడవ చేసేవాడు..

నాకు గుర్తున్నంతవరకూ ఆ ఒక్క విషయంలోనే వాళ్ళిద్దరూ గొడవపడేవారు.. నేనో, లీజా నో ఏదో ఒకటి నచ్చచెప్పేవాళ్ళం..

అలాంటిది నిజ జీవితానికొచ్చేసరికి..

'జాక్ నే మెడిసిన్ చదవమందాం, నేను మరేదైనా చదువుకుని ఉద్యోగం లో చేరతాను, మనందరికీ బావుంటుంది' అంటున్న హేరీ కి ఎలా చెప్పాలో నాకు తెలీడం లేదు..

వాడు అలా అన్నప్పుడల్లా నాకు ఏదో లా ఉంటోంది..

ఎంత చెప్పినా 'తనకిష్టం లేదు, చదవను' అంటున్నాడు.

ఆటలో కూడా డాక్టర్ కాకుండా ఉండడానికి ఒప్పుకోని వాడు, ఇలా అంటున్నాడంటే ఏదో బలమైన కారణమే ఉంది అని నేనూ లిజా కూడా అనుకున్నాం. ఎంత అడిగినా ఏమీ లేదంటాడు. 'ఆటా, జీవితం ఒకటేనా?' అంటాడు.

కానీ వాడేదో దాస్తున్నాడని నా అనుమానం.. మా ఆర్ధిక స్తోమత సరిపోదని అలా అంటున్నాడు అని.. మళ్ళీఅడిగితే అది కానే కాదంటాడు. మనిషిలో ఏ అసంతృప్తి కనపడదు..

మీరొక్కసారి వాడితో మాట్లాడి ఒప్పించగలిగితే బావుంటుంది." అన్నాడు కెవిన్..

"మీరంత గిల్టీగా ఫీలవకండి. ఎదిగిన పిల్లల ఆలోచనలని మనం నియంత్రించలేము కదా! నేను మాట్లాడి చూస్తాను" అంది నీత.

**హేరీ:**

"హాయ్ హేరీ!" పలకరించింది తన ఎదురుగా ఉన్న కుర్రవాడిని..

"హాయ్ మేమ్!" అన్నాడు హుషారుగా.. ఎక్కడా నిరుత్సాహం కానీ, చిరాకు కానీ లేదు అతని ముఖంలో..

"ఊరికే ఉపోద్ఘాతాలొద్దు, సూటిగా అడుగుతాను, జవాబు చెప్పండి.. మీకెంతో ఇష్టమైన మెడికల్ కోర్స్ ఎందుకు చదవనంటున్నారు? " అంది నీత..

"డాడ్ చెప్పారా? నాకు తెలుసు, తనకస్సలు నచ్చలెదు నేనలా అనడం!" అన్నాడు హేరీ..

ఆ ఒక్క మాటలోనే అతను కెవిన్ ని ఎంత ప్రేమిస్తున్నాడో అర్ధం అయింది ఆమెకి..

"అవును! కెవిన్ కలిశారు" పొద్దున్న అంది చిరునవ్వుతో..

"ఐ. నో హిం.. హి ఆల్వేస్ వాంట్స్ ది బెస్ట్ ఫర్ మి.. ఆరేళ్ళుగా చూస్తున్నాను కదా.. నాకే ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తారు.. జాక్ కంటే ముందు నా సుఖమే ఆలోచిస్తారు.. నేనెప్పుడూ ఏమీ ఇవ్వలేదు తిరిగి.. అయినా సరే నన్ను ప్రేమించడం మానరు.. ఎందుకో మరి.. " తనలో తనే అనుకున్నట్టుగా అన్నాడు హేరీ..

నవ్వింది నీత.. "బావుంది.. ఆయనా ఇలాగే అన్నారు"... అంది

"చెప్పాను కదా, ఆయన మంచితనం అది..

అయితే మీకు మా ఇంటి గురించి కూడా చెప్పే ఉంటారు.. మామూలు మధ్యతరగతి కుటుంబం మాది..

నాకూ, నా తమ్ముడికీ కేవలం ఒకే సంవత్సరం తేడా.. ఒక్క సంవత్సరం తేడాలో ఇద్దరి మెడికల్ స్కూల్ ఖర్చు భరించడం కష్టం మా అమ్మా నాన్నలకి..

తను సరిగ్గా చదువుకోలేదని అప్పుడు తెలీలేదు డాడ్ కి..

ఇప్పుడు తెలిసి పిల్లలు బాగా చదువుకోవాలని ఆశ.. ఒక పేరెంట్ గా అది చాలా సహజమైన కోరిక కదా! అది జాక్ ద్వారా తీరితే బావుంటుంది కదా, అన్నదే నా ఆలోచన.." ఆగాడు హేరీ..

అభినందనాపూర్వకంగా చూసింది ఆ పిల్లాడివైపు..

" మా నాన్నగారు పోయాకా, ఆయన బంధువులు మోసం చేసి అమ్మకి రావలసిన ఆస్తి రాకుండా చేశారు. అయినా మొక్కవోని ధైర్యంతో అమ్మ తిరిగి ఉద్యోగం లో చేరి అతి చిన్న అద్దె ఇంట్లో జీవితాన్ని ప్రారంభించింది..

డేడ్ కెవిన్ పరిచయం అయ్యాకా అమ్మ జీవితంలోకి తెలియని సంతోషం వచ్చింది..

ఇద్దరూ నన్ను నాకిష్టమైన ఐస్ క్రీం షాప్ కి తీసుకెళ్ళి కావలసినవి కొనిపెట్టి ఎంతో నెమ్మదిగా నాకు అర్ధం అయ్యేలా వారి నిర్ణయాన్ని చెప్పడం నేనిప్పటికి మర్చిపోలేను..

అలాగే వారు నాకు జాక్ ని పరిచయం చెయ్యడం కూడా..

'టచ్ వుడ్.'. అప్పటినించీ ఇప్పటివరకూ మా జీవితాల్లో వెలితన్నది లేదు..

డబ్బుకి మేమెప్పుడూ ప్రాధాన్యత ఇవ్వలేదు.. అందుకని అది మాకెప్పుడూ సమస్య అనిపించలేదు.. ఎండాకాలం డెక్ మీద ఆడుకున్నాం, చలికాలం ఇంట్లో ఉన్న రెండు బెడ్ రూముల్లో ఆడుకున్నాం.. ఉన్నప్పుడు ఇంకో కూర ఎక్కువ చేసుకున్నాం,లేనప్పుడు లేదు..

వీటన్నింటికీ ముఖ్య కారణం డాడ్.. కెవిన్..

దానికి ఆయనకి నేనేమిచ్చినా తక్కువే..

అందుకే నేను వేరే చదువు చదివి త్వరగా ఉద్యోగం చూసుకుంటాను అని చెప్పాను..

అలాగైతేనే డాడ్ కి రెండు రకాలుగా సహాయం చేసిన వాడినవుతాను.. ఇంటి బాధ్యత, జాక్ చదువు బాధ్యాతా తీసుకుని.

చాలా మాములుగా చెప్తున్న ఆ చిన్న కుర్రాడిని చూసి ఆశ్చర్యపోయింది..

“నీకు డాక్టర్ అవడం అంటే చాలా ఇష్టం అని చెప్పారు, పైగా నువ్వు బాగా చదువుతావుట కూడా “అంది...

తమాషాగా భుజాలెగరేశాడు

“ ఐ నో!.. ఇప్పటికీ ఇష్టమే.. ఇంట్లో ఒక డాక్టరుంటే.. నన్ను చూసి వాడు కల గన్నాడు డాక్టర్ నవ్వాలని. ఒక అన్నగా వాడి కోర్కె తీర్చడం నాకెక్కువ ఇష్టం.. ఇదీ నా కోరికే కదా!" అన్నాడు హేరీ..

ఇంకా టైముంది కనక ఈ లోపు స్కాలర్ షిప్ లాంటి ప్రయత్నాలు చెయ్యమనీ, అవి తప్పక ఫలించి ఇద్దరూ బాగా చదువుకుని డాక్టర్లయ్యి వాళ్ళ తల్లితండ్రులని మరింత ఆనందపెట్టచ్చనీ, ఇలా ఏదో చెప్పి పంపించాను ఆ అబ్బాయిని.. మొత్తానికి అమేజింగ్ పీపుల్. ఇలాంటప్పుడే అనిపిస్తుంది మనమేది పెంచితే అది పెరుగుతుంది, అందుకే అన్నాను మంచితనం ఎవరి స్వంతమూ కాదు, వారసత్వంగా రావాలనీ లేదు అని" అందినీత.. పొద్దున్నించీ జరిగినవన్నీ గుర్తు చేసుకుని భర్త కి క్లుప్తంగా చెప్తూ..

" అలాగా? ఓ సారి కలవాలి వాళ్ళని" అన్నాడు రిషి.

" అలాగే, మనకి వీలైన సహాయమేదైనా చెయ్యగలమా? చూడాలి" అంది నీత..

" తప్పకుండా.. సాయం చేసే చేతులు కూడా కావాలి కదా, అవి మనవైతే మంచిదే కదా!” అన్నాడు రిషి చిరునవ్వుతో.

Click here to share your comments on this story